క్లుప్తంగా

నాణ్యమైన నారు అందచేయాలి


నర్సరీలను తనిఖీ చేస్తున్న ఉద్యాన శాఖాధికారి

కనిగిరి రూరల్: రైతులకు నాణ్యమైన నారును విక్రయించాలని ఉద్యాన శాఖ అధికారి ఎం అంజలి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు, చాకిరాల, చిన్న ఇర్లపాడు గ్రామాల్లోని మిరప సాగు నర్సరీలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి అంజలి మాట్లాడుతూ నర్సరీ యజమానులు, నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్టర్‌ను నమోదు చేయాలన్నారు. రైతులకు నారు అందించే క్రమంలో విధిగా రశీదు ఇవ్వాలని తెలిపారు. రైతులు కూడా బిల్లు రసీదులు కచ్చితంగా తీసుకోవాలన్నారు. నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలన్నారు. నర్సరీలను విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలి


అరివేములలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం (పామూరు): ఉపాధ్యాయులు పాఠశాలలకు వచ్చే విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని ముళ్లపాడు, అరివేముల, చింతలపాలెం, ఏకునాంపురం ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరుపట్టీ పరిశీలించి హాజరుశాతాన్ని పెంచాలని, లేకుంటే విద్యార్థులు అమ్మఒడి పథకానికి అనర్హులవుతారని హెచ్‌ఎంలకు సూచించారు. విద్యార్థుల నోట్స్‌లను తనిఖీ చేస్తుండాలన్నారు. మధ్యాహ్న భోజన మెనూ విధిగా అమలు చేయాలని పేర్కొన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఐక్యత విజయ పథం యాత్ర

వలేటివారిపాలెం: మాజీ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ చేపట్టిన ఐక్యత విజయపథం యాత్ర లింగసముద్రం మండలంలోని తాతహోటల్ జంక్షన్‌కు శుక్రవారం చేరుకుంటుందని నిర్వహకులు బాలకోటయ్య, గోపిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తాతాహోటల్ జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పాదయాత్ర నెల్లూరు జిల్లాలో ప్రారంభమై రాళ్లపాడు ప్రాజెక్టు మీదుగా తాతా హోటల్‌గా చేరుకునే సరిగా 600 కిలోమీటర్లు పూర్తవుతుందని, ఈ నేపథ్యంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. యాత్రలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

జరుగుమల్లి: మండలంలోని వర్ధినేనివారిపాలెంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు పోలేరమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు

కనిగిరి రూరల్: వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వారధుల్లా పనిచేయాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బడుగులేరు సచివాలయం పరిధిలో ఇద్దరు నూతన వలంటీర్లకు నియామకపత్రాన్ని గురువారం అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను అర్హులందరికీ అందజేయాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జున రావు, సీనియర్ అసిస్టెంట్ రహమత్‌బాషా తదితరులున్నారు.

పౌష్టికాహారం ఆవశ్యకతను గుర్తెరగాలి

పామూరు: పౌష్టికాహార ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి, సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య అన్నారు. మండలంలోని వగ్గంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం ఇతర పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలన్నారు. అధిక పౌష్టికాహారం ఉన్న ముడిధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు తినాలని సూచించారు. బిడ్డల ఎదుగుదలలో మార్పులను తల్లులు గుర్తించాలని సూచించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వాలకు భిన్నంగా అంగన్‌వాడీ కేంద్రాలను అన్నిహంగులతో తీర్చిదిద్దుతున్నారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్ర నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు పాల్గొన్నారు.


పామూరులో ఉట్టికొట్టడాన్ని ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు


పామూరులో ఉట్టికొడుతున్న యువకులు

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..

కనిగిరి రూరల్:

స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక విష్ణు సహస్త్ర నామ పారాయణం, శ్రీ కృష్ణభగవానునికి అష్టోత్తర పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. చిన్నారులు రాధకృష్ణుల వేషాధారణలతో అలరించారు. కోలాట భజనలు జరిగాయి. 108 నైవేద్యాలతో విశిష్ట పూజలు చేశారు. డాక్టర్ సుబ్బారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు ముచ్చర్ల ధర్మారావు, విసిరామ శాస్త్రీ, ఏసీ చెంచులు, టంగుటూరి గోవిందరావు, మండ్ల వెంకటేశ్వర్లు, ఈర్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): మండలకేంద్రమైన సీఎస్ పురంతోపాటు మండలంలోని పలు గ్రామాలు, ప్రభుత్వ పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు క్రిష్ణుడుగా, గోపికల వేషధారణతో కలిసి ప్రదర్శించిన కార్యక్రమాలు అలరించాయి.

పామూరు: శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక మదన వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణి, సత్యభామా సమేత మదన వేణుగోపాలస్వామి మూలవిగ్రహమూర్తికి, పంచలోహ ఉత్సవమూర్తులకు అర్చకులు నారాయణం సత్యబాబుస్వామి, నారాయణం గోపాలాచార్యులు అభిషేకం నిర్వహించి అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా సాయంత్ర సమయంలో ఆలయం వద్ద వేడుకగా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రుక్మిణి, సత్యభామా సమేత మదనవేణుగోపాలస్వామి పంచలోహ విగ్రహమూర్తులకు గ్రామోత్సవం మేళతాళాల నడుమ సాగింది. దేవస్థాన చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, సభ్యులు పశుపులేటి రఘురాం, పుట్లూరి యోగీశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


సీఎస్‌పురంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు


కనిగిరి ఆలయంలో భక్తుల పూజలు

ఘనంగా గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట


గంగమ్మ తల్లి ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

హనుమంతునిపాడు: మండల కేంద్రమైన హనుమంతునిపాడులో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక అభిషేకాలు, కలశ పూజలు, కుంకుమ పూజలు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. పూజలను తిలకించడానికి గ్రామం నుంచే గాక మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ప్రతిష్ట అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. పూజల్లో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

కనిగిరి రూరల్: విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు గురువారం కనిగిరి డివిజన్‌లో దాడులు నిర్వహించారు. 1210 సర్వీసులను అకస్మకంగా తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఈఈ టి. శ్రీనివాసరావు, విద్యుత్ ఈఈ ఎం నాగేశ్వరరావులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసి రూ.64 వేల జరిమానా, విద్యుత్ అధిక లోడును వినియోగిస్తున్న 25 మందిపై కేసులు నమోదు చేసి రూ.56వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కనిగిరి, పామూరు ఏడీఈలు ఉమాకాంత్, టి.శ్రీకాంత్, విద్యుత్ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

సాగర్ నీటి సమస్యకు తక్షణ పరిష్కారం


సాగర్ నీటి సరఫరాను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్, కమిషనర్ నారాయణరావు

కనిగిరి రూరల్: సాగర్ నీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. కనిగిరి ఎస్ఎస్ ట్యాంక్, సాగర్ కుళాయిల వద్ద వాటర్ సరఫరాను గురువారం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్‌గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పైప్ లైన్ మరమ్మతులు, సాంకేతిక సమస్యలతో బుధవారం సాయంత్రం కొద్ది సేపు నీటి సరఫరా నిలిచిందన్నారు. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు .. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ తక్షణం స్పందించి సంబంధిత అధికారులతో, గుత్తేదారులతో మాట్లాడి ప్రత్యామ్నాయంగా పునుగోడు సంప్ నుంచి నీటిని పంపింగ్ చేయించి, పట్టణానికి సాగర్ వాటర్ సరఫరాను యధావిధిగా అందచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ కోటేశ్వరరావు, ఇన్‌చార్జి శానటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నీళ్ల పై నీచ రాజకీయం తగదు

పైపుల మరమ్మతుల సమస్యతో సాగర్ నీటి సరఫరా ఒక్క పూట ఆగితే దాన్ని కూడా రాజకీయం చేయాలనుకోవడం తగదని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ హయాంలో పైపుల పగళ్లు, లీకేజీల సమస్యతో, జీతాల సమస్యతో వారాల తరబడి సాగర్ నీటి సరఫరా ఆగిందని, ప్రజలు ఆందోళనలు కూడా చేశారని ఆయన గుర్తు చేశారు. పైపుల డ్యామేజ్‌తో నీళ్ల సమస్యలు అప్పుడప్పుడు రావడం సహజం అనీ.. కానీ దాన్ని రాజకీయ దురుద్దేశంతో అధికార పార్టీ నాయకులపై బురదజల్లడం నీచమైన సంస్కృతిగా అభివర్ణించారు. సమస్యపై కనీస అవగాహన లేకుండా పత్రికల్లో పొంతన లేని వార్తలు రాయడంపై వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు చెప్పారు. నీళ్ల సమస్యను తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ స్పందించి, సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులతో మాట్లాడి గురువారం ఉదయం నాల్గు గంటల నుంచే సాగర్ నీటిని కనిగిరి ప్రజలకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. పునుగోడు వాటర్ సంప్ ల నుంచి కనిగిరి ఎస్ఎస్ ట్యాంక్ ద్వార నీళ్లు అందిస్తున్నట్లు వివరించారు.

ఎంపీ సహకారంతో రోడ్ల అభివృద్ధి


రహదారి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి సహకారంతో మర్రిపూడిలో గురువారం అభివృద్ధి పనులు చేపట్టారు. పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి కొండ నుంచి పిచ్చిరెడ్డి కుంట వరకు, అలాగే వాకా వీరనారాయణరెడ్డి పొలం వద్ద నుంచి కంభాలపాడు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను జేసీబీ సహాయంతో తొలగించే పనులను ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ప్రారంభించారు. రైతులు పొలం వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి చొరవతో పనులు చేపట్టారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ కదిరి భాస్కర్, బోగసముద్రం విజయ భాస్కర్‌రెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, మాచేపల్లి నాగయ్య, కొండ్రు ఇజ్రాయిల్, నర్సింహారావు పాల్గొన్నారు.

చేయీ చేయీ కలుపుదాం..


పార్టీ నాయకులు, కార్యకర్తలతో వరికూటి అశోక్‌బాబు

- సొంతగా సోనాబోటు సమకూర్చుకునేందుకు విరాళాలివ్వండి
- వైఎస్సార్ సీపీ శ్రేణులు, మత్స్యకారులకు వరికూటి అశోక్‌బాబు పిలుపు

సింగరాయకొండ: తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు సోనా బోట్ల కారణంగా సింగరాయకొండ మండలంలోని మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని, సమస్య పరిష్కారానికి అవసరమైన సోనాబోటు కొనుగోలుకు ప్రతి ఒక్కరు చేయిచేయి కలపాలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం పార్టీ నాయకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ.. పాకల, ఊళ్లపాలెం గ్రామాల్లో సుమారు 3 వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వేట కోసం లక్షలాది రూపాయల వలలు ఉపయోగిస్తున్నారన్నారు. కానీ కొంత కాలంగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు బోట్లు సముద్ర తీరప్రాంత నిబంధనలకు విరుద్ధంగా చేపల వేట సాగిస్తుండటంతో వలలు తెగిపోతున్నాయని, మత్స్య సందప లేక జాలర్లు విలవిల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోనాబోట్లను అడ్డుకోవటానికి మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు రెండుసార్లు అడ్డుకున్నప్పటికీ పరిస్థితి మళ్లీ మొదటికొచ్చిందన్నారు. కొద్దినెలల క్రితం కావలి వద్ద ఇస్కపల్లి సముద్రతీరంలో మత్స్యకారులు కడలూరు బోట్లను అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారు దాడికి పాల్పడటంతో ఒక మత్యకారుడికి కన్ను పోయిందని చెప్పారు. ఈ నేపథ్యంలో సోనాబోట్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే మన వద్ద కూడా అదే తరహా బోటు ఉండాల్సిన అవసరముందన్నారు. సోనా బోటు కొనాలంటే కొత్తది అయితే కోటి రూపాయలు, పాతది రూ.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఫంక్షన్లు, ఉత్సవాలు, కొలుపులకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుంటామని, మంచి మనసుతో ఆలోచించి మత్స్యకారులకు సహకారం అందిద్దామని పార్టీ నాయకులను కోరారు. తాను 13 లక్షల రూపాయలు విరాళం ఇస్తున్నానని తెలిపారు. పాకల, ఊళ్లపాలెంలోని మత్స్యకార గ్రామాల నుంచి 9 మంది సభ్యులతో కమిటీ వేస్తున్నామని, వారి ఆధ్వర్యంలో బోటుకు అవసరమైన డబ్బు దాతల నుంచి సమకూర్చుదామన్నారు. దీనిపై పార్టీ నాయకులు, కార్యకర్తలు స్పందిస్తూ మత్యకారులకు అండగా ఉంటామని ప్రకటించారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, షేక్ ఇస్మాయిల్, షేక్ పటేల్,షేక్ సలీంభాషా, పిట్టా బ్రహ్మయ్య, సాయికోటి, షేక్ సుల్తాన్, కాళహస్తి వెంకారెడ్డి, షేక్ సలీం, పంతగాని నరసింహారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్ కానుక


పెన్షన్ నగదు ఇస్తున్న చైర్మన్ గఫార్, కౌన్సిలర్లు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ పెన్షన్ అందజేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 3,9వ సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్ కానుక నగదు ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందచేస్తున్నట్లు చెప్పారు. గతంలో పెన్షన్ పొందాలంటే, అధికారుల, నాయకుల, కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వార అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి నేరుగా సంక్షేమ లబ్ధిని అందచేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్లు దేవరాజ్, దేవకి సత్యావతి, కోఆప్షన్ సభ్యుడు గూడూరి అబ్రహం లింకన్, మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, అడ్మిన్, వెల్ఫర్ సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి


డిజిటల్ బోర్డును పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

హనుమంతునిపాడు: స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను గురువారం డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర రావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరు రికార్డులను, సర్వీసు రికార్డులను, విద్యార్థుల పుస్తకాలను, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నై పుణ్యంతో పాటు విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న డిజిటల్ బోర్డులు పనితీరును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్యనందించడం గర్వపడాలన్నారు. ప్రతి 8వ తరగతి విద్యార్థులకు అందించే బైజూస్ కంటెంట్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఎంఈఓలు ఎస్ వి. రమణయ్య, పెద్దిరాజు, హెచ్‌ఎం సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఇద్దరు ఎంపిక


అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జరుగుమల్లి: మండలంలోని కె.బిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఇద్దరు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.లక్ష్మీనారాయణ తెలిపారు. సింగరాయకొండలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో 800 మీటర్ల రన్నింగ్‌లో ఆకాష్ ప్రథమ స్థానం, జావెలిన్ త్రోలో డి.ప్రజ్వల్ ద్వితీయ స్థానం సాధించారు. వీరు ఈ నెలలో ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసులు తెలిపారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు పి.ఆదిలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు


కొండపి సర్కిల్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ రామరాజు

కొండపి(సింగరాయకొండ): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించవద్దని పోలీసు సిబ్బందికి కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు దిశానిర్దేశం చేశారు. కొండపి సర్కిల్ కార్యాలయంలో గురువారం సర్కిల్ పరిధిలోని మూడు మండలాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ రామరాజు మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చిన్న సంఘటననూ ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలని, ప్రధాన సెంటర్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అల్లర్లు జరగకుండా గ్రామాల్లో పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సిబ్బంది సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అంతకుముందు పొన్నలూరు, మర్రిపూడి మండలాల్లో రెండు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులను డీఎస్పీ విచారించారు. సీఐ వై.పాండురంగారావు, ఎస్సైలు వైవీ రమణయ్య, బసవరాజు, దాసరి రాజారావు పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతం

వలేటివారిపాలెం: శ్రావణ మాసం సందర్భంగా స్థానిక భ్రమరాంబిక మల్లికార్జున దేవాలయంలో శుక్రవారంవరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు చంద్రకాంత్ శర్మ తెలిపారు. శివునికి ప్రత్యేక అభిషేకం చేస్తామన్నారు.

డాక్యుమెంట్ పోయినది

ఉలవపాడు మండలం - వీరేపల్లి గ్రామమునకు చెందిన దంతలూరి మురళీమోహన్ బాబు కు చెందిన ఉలవపాడు నందు గల తహసిల్దారు ఆఫీస్ ద్వారా జారీచేయబడిన ఒరిజినల్ పొసెసస్ సర్టిఫికేట్ నెంబర్: Ld /S/22/2009 తేది: 18/12/2010, సింగరాయకొండలోని స్టేషన్ రోడ్ ఎదురు, ట్రంక్ రోడ్ నందు పోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలుపగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

దంతలూరి మురళీమోహన్ బాబు, మల్లెతోట 1వ లైన్, కనుమళ్లరోడ్, ఉదిగమిట్ల సింగరాయకొండ. సెల్ : 9848818006

సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం భరోసా


ఇంక్రిమెంట్ కాపీలను అందచేస్తున్న ఎంపీపీ ప్రకాశం, ఎంపీడీఓ మల్లికార్జునరావు

కనిగిరి రూరల్: సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం మరింత అండ, భరోసా కల్పిస్తోందని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. సచివాలయాల్లో గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న కనిగిరి మండలంలోని ఉద్యోగులకు గురువారం మొదటి ఇంక్రిమెంట్ జీతాలను అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వార సుమారు 4 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేయడమే కాకుండా ఇంక్రిమెంట్‌లను అందచేయడాన్ని కొనియాడారు. సచివాలయ ఉద్యోగులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉండాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జున రావు, సీనియర్ అసిస్టెంట్ రహమత్ బాషా, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.